క్లుప్తంగా

వాటర్‌ఫిల్టర్ మరమ్మతులకు విరాళం



విరాళం అందజేస్తున్న దేవేందర్‌ముదిరాజ్

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాయకులు, వ్యాపారులు తమవంతు సహకారం అందించాలని కాంగ్రెస్ సీనియర్ నేత దేవేందర్‌ముదిరాజ్ కోరారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి వాటర్ ఫిల్టర్ మరమ్మతుల కోసం బుధవారం ఆయన రూ.20వేల విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బాలప్రసాద్, రాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ అర్చకుడికి పరామర్శ



రంగరాజన్‌ను పరామర్శిస్తున్న నాయకులు

సాక్షి, సిటీబ్యూరో: చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌ను ధార్మిక జనమోర్చా నాయకుడు డాక్టర్ ఆతిఫ్ ఇస్మాయిల్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ధార్మిక జనమోర్చా నాయకులు ఆయనపై జరిగిన దాడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. రంగరాజన్‌కు తామంతా అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. సమాజంలో మనుషులను విభజించే, భయాందోళనలను సృష్టించే వాతావరణాన్ని అడ్డుకోవాలని రంగరాజన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రంగరాజన్‌ను పరామర్శించిన వారిలో మజీదుల్లాఖాన్, మహమూద్ షరీఫ్, అజహర్ సులేమాన్ ఉన్నారు.

ఘనంగా పడిపూజ



శివ పూజలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్: మండల పరిధిలోని మేడిపల్లిలో శివమాల వేసిన భక్తులు బుధవారం శ్రీశైలంకు బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామంలో శివస్వాములు పడిపూజ ఘనంగా నిర్వహించారు. పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో గ్రామంలోని వీధులన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం శివ భక్తులు శ్రీశైలం బయలుదేరివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్, గురుస్వాములు హరి, వెంకటేశ్, శివస్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి 'కారు' గూటికి



కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన పలువురు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో దశరథ్‌నాయక్ వారికి కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పాలన నచ్చకనే పార్టీ మారుతున్నామని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో గణేశ్, జైపాల్, గోపాల్, మునీందర్, దశరథ్, నరి, మల్లేశ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు లచ్చిరామ్‌నాయక్, ప్రియా రమేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు సంతోశ్‌కుమార్, గోపాల్, అంజి, హంజద్, శివరాం, దాస్య, గోపాల్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కేజ్‌వీల్స్‌తో జాగ్రత్త!

- ట్రాక్టర్ డ్రైవర్లు అజాగ్రత్తగా నడిపితే ప్రమాదం
- అప్రమత్తతే మేలని నిపుణుల సూచన

షాబాద్: ట్రాక్టర్ డ్రైవర్లు ప్రాణాలతో చెలగాటం వద్దు.. అప్రమత్తతతోనే రక్ష.. ప్రస్తుత కాలంలో వ్యవసాయంలో యంత్రాల వినియోగం ఎక్కువైంది. పొలం దున్నేందుకు, జంబులు కొట్టేందుకు ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారు. కేజీవీల్స్‌తో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. డ్రైవర్లు వీటి కిందపడి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ తరుణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



షాబాద్‌లో కేజ్‌వీల్స్‌తో పొలం దున్నుతున్న రైతు(ఫైల్)

ప్రమాదాలకు కారణాలు..

- పొలాలు అన్ని ఒకేలా ఉండవు. పొలాన్ని నీటితో నింపిన తర్వాత డ్రైవర్‌కు భూమి ఎలాంటిదో తెలియకపోవడం.
- నారు ఎక్కువగా ఉన్న స్థలంలో ఎక్కువ లోతుకు కేజీవీల్ వెళ్లడం. అక్కడ భూమి వదులుగా మారుతుంది.
- గట్టి ప్రదేశంలో వెళ్లడానికి డ్రైవర్లు యాక్సిలేటర్ ఎక్కువగా ఇస్తుంటారు. బరువంతా కేజీవీల్స్‌పై పడుతుంది. దీంతో ముందు టైర్లు అంతగా బరువులేక పోవడంతో ట్రాక్టర్ బోల్తాపడే అవకాశాలు ఉంటాయి.
- పొలం చివరి మూలల్లో ఎక్కువ సార్లు కేజీవీల్స్ నడుస్తాయి. అక్కడ లోతుగా తయారవుతుంది. వేగంగా వెళ్లే క్రమంలో దిగబడి బోల్తా పడుతుంది.
- డ్రైవర్లకు పూర్తిస్థాయి నైపుణ్యత లేక, ఓవర్ స్పీడ్‌తో పొలాల్లో దున్నడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్ దున్నడంలో లోతు పెరిగిన కొద్ది ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువగా ఆస్కారం ఉందని ఇంజనీరింగ్, వ్యవసాయ శాస్త్రవేతలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- మామూలుగా 20–25సెం.మీ లోతు కంటే ఎక్కువ లోతు వెళ్తే ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు..

- కేజీవీల్స్ బిగించేటప్పుడు తప్పనిసరిగా వెనుక టైర్లు సమానస్థాయిలో ట్రాక్టర్ బంపర్ ముందు వెయిట్ బిల్లలు వేసుకోవాలి.
- బరువు ఎక్కువైతే మైలేజ్ తక్కువగా వస్తుందనే ఉద్దేశంతో వాడటం లేదు. సరైన విధానం కాదు.
- ట్రాక్టర్‌ను పొలంలోకి దించే ముందు పూర్తిస్థాయిలో కండిషన్‌గా ఉంచుకోవాలి.
- పొలం దున్నుతున్న సమయంలో ట్రాక్టర్‌ను ఎప్పుడు ఒకే వేగంతో నడపాలి.
- యజమానుల మెప్పు కోసం వేగం పెంచొద్దు.
- మూలమలుపు దగ్గర వేగం తగ్గించాలి.
- కేజీవీల్స్‌తో దున్నేప్పుడు ట్రాక్టర్‌కు కల్టివేటర్ అమర్చుకోవాలి. దీంతో బోల్తాపడే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

కంటి సంరక్షణకు చర్యలు



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

షాద్‌నగర్: విద్యార్థుల కంటి సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. శరీరంలోని ఇంద్రియాలన్నింటిలో కళ్లు ఎంతో ప్రధానమైనవని, ప్రతి ఒక్కరూ వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌లను ఎక్కువగా చూడటంతో కంటిలోని శుక్లాలు దెబ్బతింటాయన్నారు. కంప్యూటర్‌పై పని చేస్తున్నప్పుడు తరచూ రెప్పలు కొడుతూ ఉండాలన్నారు. కాంతివంతంగా కనిపించేలా మానిటర్ లైటింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా బయటికి వెళ్లినప్పుడు కళ్లలో దుమ్ము, ధూళి పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంటికి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సమీపంలో ఉన్న కంటి వైద్యులను సంప్రదించి చికిత్సలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం చిన్నారుల కంటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా మూడురోజుల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు విజయలక్ష్మి, రాగిణి, కార్తీక్, సంధ్య, పుష్పలత, సౌజన్య, పద్మలత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని దేవరంపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీఅనంతపద్మనాభస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలతో పాటు గ్రామంలో దుర్గమ్మ, మైసమ్మ, ఈదమ్మ, నాభిశిల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆయా కార్యక్రమాల్లో బుధవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు గోనే ప్రతాప్‌రెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, నాయకులు ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా, శ్రీనివాస్, మాణిక్యరెడ్డి, హన్మంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, డాక్టర్ వైభవ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అభి, మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్, రాంప్రసాద్, గని, నరహరిరెడ్డి, మాదవ్‌రెడ్డి, తదితరులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

న్యాయం చేయాలని బాధితుడి వినతి

మొయినాబాద్‌రూరల్: తాను నిర్మించుకుంటున్న ఇంటిని అక్రమంగా కూల్చివేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ చాకలిగూడ గ్రామానికి చెందిన బాధితుడు రేనట్ల దర్శన్‌గౌడ్ ఎంపీడీఓ సంధ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణం కోసం అప్పటి మాజీ సర్పంచ్ వద్ద వెంకటయ్య వద్ద 2009 జూలై 26వ తేదీన ఇంటి పర్మిషన్ తీసుకున్నట్లు తెలిపారు. పాత ఇంటి ముందు ఉన్న స్థలంలో నిర్మాణం చేసుకుంటుండగా జేసీబీతో పంచాయతీ కార్యదర్శి కూల్చివేయించారని తెలిపారు. తమ ఇళ్ల నిర్మాణంలో ఉన్నప్పుడు కూల్చివేయడంతో తనకు ఆస్తినష్టం జరిగిందని, నాకు న్యాయం చేయాలని కోరుతూ దర్శన్‌గౌడ్ అధికారికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి అధికారి సంధ్య వివరణ ఇస్తూ గురువారం గ్రామంలో గ్రామసభ నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో సీసీరోడ్డు పనులను షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు.టీ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు అమీర్, గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీశైలం, అరుణమ్మ, దిద్దేల ముత్యాలు, జంగయ్య, రామకృష్ణ, ఖాజాపాషా, చంద్రయ్య, యాదయ్య, ప్రవీణ్, గోపాల్, కృష్ణయ్య, వెంకటయ్య, బాలకృష్ణ, అంజయ్య పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



పూజల్లో పాల్గొన్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని అమ్డాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్తమైసమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గత రెండు రోజుల పాటు పూజా కార్యక్రమాలు కొనసాగగా.. మూడోరోజు బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయ నిర్మాణ దాత కిస్మత్‌పూర్ గోకరి అర్జున్‌గౌడ్ కాగా ఆలయ చైర్మన్ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, బూర్గురవలి గోపికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వడ్లనాగార్జునచారి, అన్నదాత ప్రభువులు సామ శేఖర్‌రెడ్డి, మన్నె ప్రభాకర్‌రెడ్డి, మాడి పెంటారెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

దేవాలయాల నిర్మాణాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి అన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, విశ్వకర్మ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహాచారి, వికారాబాద్ మాజీ చైర్‌పర్సన్ సునితామహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పాండుగౌడ్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు



పండ్ల దుకాణ యజమానితో మాట్లాడుతున్న కమిషనర్

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

మొయినాబాద్‌రూరల్: రోడ్లపై చెత్త, కవర్లు వేసే వారిపై కఠిన చర్యలతో పాటు జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లపై వెలిసిన పండ్ల దుకాణాలు, హోటళ్లను పరిశీలించారు. రోడ్లపై చెత్తచెదారం వేయొద్దని సూచించారు. చుట్టు పక్కల పరిసరాలు చెత్తాచెదారంతో ఉండడంతో పండ్ల దుకాణ యజమానిపై ఆయన మండిపడ్డారు. రోడ్లపై ఎవరైనా చెత్తవేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు అధికారి సంధ్యారాణి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్

కొందుర్గు: క్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీర్నపేటలో బుధవారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటములు సర్వసాధారణమేనని, ఓటమి గెలుపునకు నాందిగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు సయ్యద్ హఫీజ్, శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాజేశ్‌పటేల్, రాములు, ప్రమోద్‌రావు, వెంకటేశ్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రవీందర్‌యాదవ్

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని, ఉత్తమ భవిష్యత్ పొందాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విద్యార్థులకు సూచించారు. కొందుర్గు ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందిస్తున్న ఆహారం, బోధనా విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. అనంతరం గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఛత్రపతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు కావలి యాదయ్య, నరేందర్, రామయ్యగౌడ్, పురుషోత్తంరెడ్డి, శ్రీను, విక్రమ్‌రెడ్డి, జీబీ కృష్ణ పాల్గొన్నారు.



గురుకులంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బీఆర్‌ఎస్‌వి దొంగ దీక్షలు

- ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు గులాబీ నేతలకు లేదు
- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్

కడ్తాల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని.. ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నేతలకు లేదని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతు సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తుంటే రైతుదీక్షల పేరిట బీఆర్‌ఎస్ నేతలు దొంగ దీక్షలు చేపడుతున్నారని విమర్శించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులను కలవడానికి ఇష్టపడని నాయకులకు అధికారం పోగానే ప్రజలు గుర్తుకు వస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న ఆరోపణలను, మాటలను ప్రజలు చీత్కరించుకుంటున్నారన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి రెండు సార్లు అధికారం చేపట్టినా రూ.లక్ష కూడా మాఫీ చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరి ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నేతలు అసత్య ప్రచారాలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాబుద్దీన్, రవి, భానుకిరన్, నరేశ్, శ్రీకాంత్, సాయి, రమేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న క్యామ రాజేశ్

పోరాటయోధుడు ఛత్రపతి



షాద్‌నగర్‌లో నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



చేవెళ్ల: శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు



మొయినాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న మరాఠి సంఘం నాయకులు

ఛత్రపతి శివాజీ మహారాజ్ పోరాట యోధుడని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో హిందూవాహిని, బజరంగ్ దళ్, ఆరె కటికె సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీలు నిర్వహించారు. హిందూ సామ్రాజ్య స్థాపనకు శివాజీ మహారాజ్ చేసిన పోరాటాలు చరిత్రలో ఎప్పటికీ చిరస్మణీయంగా ఉంటాయన్నారు. ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పలువురు సూచించారు.



చేవెళ్ల: రావుపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కొత్తూరు: విగ్రహానికి నివాళులర్పిస్తున్న బజరంగ్‌దళ్ సభ్యులు



శంకర్‌పల్లి: రక్తదానం చేసిన యువకులకు ధ్రువీకరణపత్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



శంకర్‌పల్లి: క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు